ఫోన్ మ్రోగింది.

బద్ధకంగా పడుకున్న శ్యామలరావు విసుక్కుంటూ లేచి ఫోన్ ఎత్తాడు.

'ఏమండోయి! ఏం చేస్తున్నారు!' సన్నని మధురస్వరం చెవిలో కితకితలు పెట్టింది.

పయ్యాం దేవత

పోట్లకూచి సాంబశివరావు

శ్యామలరావు బద్ధకం మాయమై పోయింది. కళ్ళు పెద్దవి చేసి ఒక చిన్న నవ్వు నవ్వుకున్నాడు.

'ఎన్నాళ్ళకు ?' ఏమిటి విశేషాలు ?

'గుర్తు పట్టారా ?'

'గుర్తు పట్టకేం ? విమల !'

ఫక్కున నవ్వు ... టెలిఫోనులో సముద్ర తరంగాలు తీరాన్ని కొట్టినట్లు ఆమెనవ్వు చెవికి చెప్ప లేనంత తాకిడి — చెవి గింగురుమంది. ఆ నవ్వు జ్ఞప్తికి వచ్చింది. ఆమె మాత్రమే అలా నవ్వ కలదు — ఆమె పేరు—తెల్లకొంగ. మాట సర్దుకున్నాడు శ్యామలరావు.

'మమ్మల్ని మరపింప జేసిన ఆ విమల ఎవరండీ ?'

'ఎవ రేమిటి — ఒక ఆడమనిషి.' నవ్వేశాడు శ్యామలరావు.

'మీ యింటి మీదకు దండయాత్ర చేయ్యా లని వుంది — రావచ్చా ?'

'ఓ తప్పకుండా !'

'సైన్యసమేతంగా వస్తున్నా.'

'ఎవ రా సైన్యం ?'

'వచ్చేక చూసుకోండి! — వస్తున్నా-టా టా!' ఆమె ఫోన్ పెట్టేసింది ... శ్యామలరావు ఒక్క నిమిషం ఆవ లించాడు. పోస్టుమేన్ కిటికీలోంచి వుత్త రాలు లోనికి విసిరేడు. ఒక్కొక్క వుత్తరం చూసుకున్నాడు శ్యామలరావు ... ఒక వుత్తరం చెల్లెలు వద్దనుంచి—ఒంట్లో బాగుండ లేదని, అత్తగారు తనతోనే

వుంటోందని.చాకిరి పెరిగి చిక్కి శల్య మైపోతున్నానని.

'అత్తగారికి దెయ్యాలు. దేవతలు పూనతారుట — ఎలావుందో పాపం! ముసలావిడ !" అటు పుల్ల యిటు పెట్ట కుండా హాయిగా జీవితం గడిపే ఆవిడను స్మరించుకున్నాడు శ్యామలరావు.

కిటికిలోంచి బాణంలా ఒక కాగితం మీద పడింది. ఆ చుట్ట చుట్టిన కాగితం విప్పాడు.

'మీ వైఖరి నాకు నచ్చలేదు-ఎన్నాళ్లు ఇలాగ?'

ఆ దస్తూరీ ఆతనికి పరిచయమే-ఒక మందస్మితం చేశాడు శ్యామలరావు.

తలుపులు బిగించి, స్నానం చేసి, సిగ రెట్టు పీలుస్తూ వార్తాపత్రిక తిరగవేశాడు. నామాలలంక కోనేరుప్రక్కనే ఒక బాల యోగి క్రొత్తగా బయలుదేరాడట- ఒకమ్మాయి ఆత్మహత్య చేసుకుంది— ఆలమూరులో అమ్మవారి జాతరలో కాలు జారి పదిమంది నాగులు చెరువులో పడి చచ్చిపోయారుట —

గడియారం చూశాడు శ్యామలరావు— ఆరు గంటలు-సాయంత్రం కిటికీలోంచి వీథిలోకి చూశాడు. ఆకాశం సంధ్యా రాగంలో అందంగా వుంది — ఒక ప్రక్క నుంచి కారు మేఘాలు పరుగెత్తుకు వస్తున్నాయి. ఆ అందం మింగేయాలని.

చల్లటిగాలి వీస్తోంది.

రేడియో తిప్పాడు శ్యామరావు.

'మేరే దిల్ టూట్ గయా' పాట శ్రావ్యంగా, ధారంగా సాగుతోంది.

తలుపు - ధన్ ధన్ చప్పుడు-

లేచివెళ్ళి తలుపు తీశాడు.

ముగ్గురు ఆడవాళ్ళు ప్రత్యక్షం.

'మీ అమూల్యమైన కాలం మేమేమీ హరించటం లేదుగదా!

'లేదు - ముసిముసినవ్వుతో లోప లికి ఆహ్వానించాడు ఆమెను.

ముగ్గురూ వచ్చి కుర్చీల్లో కూర్చు న్నారు.

'జ్ఞాపకం వున్నానా?'

'ఊఁ'

'ఎవరు నేను?' సూటిగా చూసింది ఆమె-అదో పిచ్చిచూపు.

'అదే-తెల్లకొంగ.'

ఆమె, శ్యామలరావు ఫక్కున నవ్వు కున్నారు. తక్కిన ఆడవాళ్ళిద్దరూ మర్యాదగ నవ్వారు.

"ఈమె మా అక్క, కమల-ఈమె మా పక్కింటి అమ్మాయి, సంజీవి."

ఇద్దరికీ నమస్కారం పెట్టాడు శ్యామలరావు.

శ్యామలరావు ఇంటర్మీడియేట్ చదువుకునే రోజుల్లో ఆదే పరిచయం కలిగింది. తనకంటె ఆమె ఒక క్లాసు జూనియర్. ఎప్పుడూ తెల్లనిచీర, తెల్లని రవిక, తెల్లని మల్లెపూలు పెట్టుకుని ఆరడుగుల పొడుగుతో సన్నగా రివటగా రోజూ కాలేజీలో ఆమె దర్శనమివ్వడం

వల్ల. కొంచెం కుర్రాళ్ళు ఆమెకు 'తెల్ల కొంగ' అని పేరు పెట్టారు. ఎవరైనా ఆమెను అలా పిలిస్తే ఆమెకు ఉడుకు మోత్తనం వచ్చేది. కాని శ్యామలరావంటే ఆమెకు అభిమానం ఏర్పడింది. ప్రిన్సిపాలుగారి అబ్బాయి కావడంవల్ల చనువు పెరిగాక అతను పిలిచినా ఏమనేదికాదు.

ఇద్దరూ పుస్తకాల పురుగు లవడంచే లైబ్రరీలో పెరిగిన వారి చదువు స్నేహంగా మారింది. శ్యామలరావు ఆమెను తల్లికి పరిచయం చేశాడు. అప్పుడప్పుడు వచ్చిపోయేది ఆత నింటి కామె. ఇంటరు పూర్తికాగానే కాశ్మీరులో నున్న అక్కయ్యగారింటికి వెళ్ళి ఆర్నెల్లకు తిరిగివచ్చింది. మరో అర్నెల్లు తమదగ్గర వుంచుకోవా లని అక్కయ్యను వెంటబెట్టుకు వచ్చింది.

'కాశ్మీరులో ఏ సరస్సుల్లో విహరించి వచ్చారు, తెల్లకొంగగారూ!' అన్నాడు శ్యామలరావు.

'ఇదిగో, మావాళ్ళ ముందు నన్ను అలా పిలవకండి!'

'ఏం?'

'వాళ్ళకు లోకువైపోనూ!'

శ్యామలరావుకు సామభూతి కలిగింది.

'శకుంతలగారూ!' అన్నాడు.

'హమ్మయ్య' నవ్వింది ఆమె.

బయట గాలి విజృంభించింది. దుమ్ము దూమారం రేగింది. పరుగు పందాల్లో మేఘాలు ఆకాశంలో పరుగిడుతున్నాయి.

'రాకరాక మీరు రావడం – గాలి దుమారం రేగడం' అన్నాడు శ్యామలరావు.

'గాలిదుమారంలోనే ఏదైనా అదృష్టం కొట్టుకురావచ్చు' కమల మాట కలిపింది.

'చూద్దాం, ఏ మదృష్ట మొస్తుందో.' శ్యామలరావు పెదిమ విరిచాడు.

'మీ అమ్మా నాన్నా ఎరీ?'

'వూరెళ్ళారు.'

'ఏ వూరు?'

'కాశ్మీరుమాత్రం కాదు.'

శకుంతల నవ్వింది.

'అయితే ఒంటరి భాగోతం అన్న మాట.' శకుంతల వెక్కిరించింది.

'ఎందుకు? మీ రున్నారుగా.' ముగ్గురి వైపు చూశాడు శ్యామలరావు.

గాలి పెరిగింది–ద్వారబంధాల తెరలు గాలికి రెపరెప కొట్టుకుంటున్నాయి–టేబులుమీది అద్దం క్రింద పడి ముక్కలయింది – గోడమీది ఫొటోలు ఊగుతున్నాయి.

'ఇంత పెద్ద బంగళాలో – నువ్వు ఒక్కడవు; భయంలేదూ?'

'మొగాడికి భయమేమిటి? ఆడవాళ్ళకు కానీ.'

'కాస్సేపు అడదానిగా మారి కాస్త అతిథిసత్కారం చేయరాదూ!' శకుంతల మాటలకు కొంచెం ఉలిక్కిపడ్డాడు శ్యామలరావు. అరగంటయి వచ్చినా అతిథులకు ఏమీ యివ్వలేదని బాధపడ్డాడు.

'ఉండండి - కాఫీ తెస్తా.'

'మీరే చేస్తారా - ఎవరైనా చేసి వుంచేరా ?'

'లేదండి - నేనే చేసితెస్తా కాఫీ !

'ఉండండి - నేనూ వస్తా - సాయం చేస్తా !'

శకుంతల, శ్యామలరావు వంటింట్లోకి వెళ్ళారు.

కమల, సంజీవి కలిసి నవ్వుకున్నారు.

'ఏపిలుపండులా ఎర్రటిముఖం యీ యనది' అంది సంజీవి.

'కోసుకుతింటావా ఏమిటి - ఫలహారంగా ?' నవ్వింది కమల.

'అక్కయ్యోయి! నీకు ఆపిలుపండు యిష్టంకదూ?' అంటూ పండు పుచ్చుకుని వచ్చింది వారి గదిలోకి.

శకుంతల చేతిలో ఎర్రటిపండు చూసింది సంజీవి.

'నిజంగా ఆయన ముఖం చేత్తో పట్టుకు వచ్చా వనుకున్నా !'

కమల వెక్కిరించింది.

'ఫో, మీరు మరీనూ !'

ఆపిల్ పండు లాక్కుని కమల కొరికింది.

జార్ల వేసిన గదితలుపులు భళ్ళున ఊడి తెరుచుకున్నాయి. పెద్ద గాలి తరంగం యింట్లోకి వచ్చింది. టేబులు మీద వార్తాపత్రికలు గాలిలో ఎగిరి పోయాయి. గదిలో అలంకరణ కున్న పూలవాజులు కిందపడి పగిలిపోయాయి. ముగ్గురమ్మాయిలు తబ్బిబ్బు పడ్డారు, ఆ చప్పుళ్ళు వింటూ. శ్యామలరావు నాల్గు గ్లాసుల కాఫీ లోనికి తెచ్చాడు.

ఈ లోపుగా, సంజీవీ, కమలా, గాలి ఎదురుఊపుతో కుస్తీపట్టి, గదితలుపులు బంధించారు.

'శ్రమపడ్డారు! కాఫీ తాగండి.' అందించాడు శ్యామలరావు.

'మీ యింట్లో అన్నీ పగిలిపోయాయండి !'

'రాకరాక మీరు వస్తే-ఏమౌతుంది !' నవ్వేడు శ్యామలరావు.

'నా రంగు కాఫీకాని నాకు నచ్చదండీ' అంది కమల.

ఆమెరంగు చామనచాయ.

'నాకు పంచదార ఎక్కువ కావాలండీ' అంది సంజీవి మధురంగా.

'నాకూ...' అని చప్పరించింది శకుంతల.

'నీకు గ్లాసు అడుగున కాస్త కాఫీ చాలు-ముక్కుతో పీల్చుకోడానికి' కమల హేళనచేసింది చెల్లెలిని.

'చూడండి - మా అక్కమాత్రం తెల్ల కొంగ కాదూ !' అంది శకుంతల మూతి ముడుచుకుని.

'కాదు ఎర్రకొంగ - ఎర్రచీర కట్టుకుందిగా !' సర్దింది సంజీవి.

బయట - ఉరుములు - మెరుపులు.

కుర్చీలో కూర్చుని కాఫీ తాగుతోంది శకుంతల.

టప్పుమని కాఫీకప్పులో ఏదోరాలింది.

ఉలిక్కిపడి నుంచుంది శకుంతల.

కప్పులోపడిన జంతువును చెమ్చాతో ఎత్తింది — బల్లి — కెవ్వున అరిచింది శకుంతల.

'ఆ కాఫీ పారెయ్యవే!' కమల గబుక్కున కప్పు లాగింది. అదిజారింది — క్రిందపడి పగిలింది.

'ఇంట్లో అన్నీ బద్దలుకొడుతున్నారేమిటి?' సంజీవి కోప్పడింది.

శకుంతల కిచ్చిన కాఫీ చెడినందుకు బాధపడ్డాడు శ్యామలరావు.

శకుంతల ఎలా నిలుచుందో — అలా వుండిపోయింది.

కాస్సేపు — ఆమెకళ్ళు పెద్దవై పరధ్యాన్నంగా గోడమీద ప్రాకింది దృష్టి... ఏదో నీడ కదిలింది, పొడుగ్గా — కమల ఆమె దగ్గరకు వచ్చింది — మరోనీడ కదిలింది ప్రక్కనే.

'ఎవరి వా నీడలు?' శకుంతల బెదిరింది.

'మనవేనే!' అంది కమల బుజం నిమురుతూ.

'అంత పొడుగ్గా.'

'మనం పొడుగ్గా లేం?' ఫక్కున నవ్వింది కమల. సంజీవి శ్రుతికల్పింది. శ్యామలరావు మందస్మితం చేశాడు.

విద్యుద్దీపాలు హఠాత్తుగా ఆరిపోయాయి.

'ఎక్కడవాళ్ళు అక్కడ కూర్చోండి' అన్నాడు శ్యామలరావు.

ఎవరికుర్చీల్లో వాళ్ళు వాలారు. శకుంతల మంచంమీది కొరిగింది.

కాస్సేపు నిశ్శబ్దం —

వీథిలో కుక్కలు మొరుగుతున్నాయి.

బయటి గాలివాన తుపానులా వుంది.

కిటికీతలుపులు టపటప కొట్టుకుంటున్నాయి.

'నాకు భయంగా వుంది అక్కా' అంది శకుంతల.

'ఏడిసేవు - కాస్సేపట్లో లైట్లు వస్తాయిలే! ఊరుకో!'

'ఇటువంటి చీకట్లలో దెయ్యాలు వస్తా యంటారు' అంది సంజీవి.

'బాబోయి, ఆమాట అనకే!' బ్రతి మాలింది శకుంతల.

'దెయ్యమంటే దానికి చాలాభయమే' కమల ఊతపదం.

'దెయ్యాలుగురించి చాలా కథలు తెలుసు నాకు.' శ్యామలరావు యీల వేశాడు.

'ఓకథ చెప్పుదూ.' సంజీవి అడిగింది.

'నేను విననూ - చెప్పొద్దు!' శకుం తల అరిచింది.

'చెప్పండి ఫర్వాలేదు -' కమల మౌనంగా అంగీకారం చెప్పింది.

'మావూళ్ళో గవరయ్యగారు కాలవ వొడ్డున ఓ రోజురాత్రి వెడుతుంటే - ఒక పెళ్ళివారు ఎదురయ్యారు- ఆయన్ని కూడా తమతో రమ్మని ఆతిథ్య మిచ్చారు. సుఖంగా భోజనం చేసి పడుకుని మర్నాడు లేచి చూస్తే - పెళ్ళివారులేరు - భాజాలు లేవు - గోదావరి దుబ్బుగడ్డిలో రాళ్ళమీద పడిఉన్నాడు -'

'బాగుంది - సుమీ!' ఆశ్చర్య పోయారు కమల, సంజీవి. విద్యుద్దీపాలు వెలిగాయి.

'హమ్మయ్య, నాకు కొంచెం భయం తగ్గిందిరా' శకుంతల నిట్టూర్పువిడిచింది.

పైనుంచి 'ఢభీ' మని ఒక మొక్కల కుండీ రాలింది. అందరూ ఆశ్చర్య పోయారు.

కమలచోద్యంగా చూసింది - సంజీవి కుండీ దగ్గరకు వెళ్ళి పరిశీలిం చింది - శకుంతల బిత్తరపోయి చూసింది - ఆ చిన్నకుండి ఎక్కడనుంచి వచ్చి ఎలా రాలినట్లు? అందులో మొక్క గులాబి...ముళ్ళతో...కమల ఆమొక్క తడిమిచూసింది...కరుగ్గా..గుచ్చుకుంది.

'శకుంతలా, ఎలా వచ్చిందే-ఆకుండీ లోపలికి.' శకుంతల తీవ్రంగా అరిచింది.

శ్యామలరావు బిత్తరపోయి చూస్తు న్నాడు.

'యిటువంటి గాలిదూమారం - వానల్లో...దెయ్యాలు..వస్తాయంటారా?' సంజీవి అందుకుంది.

'నిజంగా' శకుంతల మంచంమీద కూలింది.

పగిలినకుండీ కమల యింకా పరీక్షి స్తోంది. కుండీ పగలగా మట్టిముద్ద కర్రతో కదిపింది కమల ... అందు లోంచి ఏలుగుపాము...సాగింది.

'అమ్మయ్య!' సంజీవి గాభరాపడి దూరంగా పోయింది. శ్యామలరావు ఒక్కమాట మాట్లాడలేదు.

ఆ కుండీ, మొక్క, మట్టీ అన్నీ మౌనంగాతీసి- బయటకు విసిరేశాడు.

'ఏం శ్యామలరావుగారూ' యీ కుండీ ఎలా యింట్లో రాలినట్లు?' తను ప్రశ్నించింది

'అదే నాకు అర్థం కావటంలేదు.'

ఒక నిమిషం నిశ్శబ్దం.

బయట ఉరుములు - మెరుపులు

నక్కల కూతలు ..వాన హోరున కురుస్తోంది దీనిలో విద్యుద్దీపాలు ఓసు కులమధ్య తారల్లా మసక మసకగా మెరుస్తున్నాయి

'ఈ వానలో యింటికేం వెడతారు' భోజనాలు ఏర్పాట్లు యిక్కడే చేసుకుంటే బాగుంటుందేమో ' శ్యామలరావు మాటకు ఊకొట్టింది శకుంతల

'నేను వండిపెట్టనా?' లేచాడు శ్యామలరావు

'బాగుంది, అతిధులచేత వండిస్తారా ? ఏం మర్యాద ?' పకపక నవ్వింది

'ఏం, ఏయం పోయిందా ?' సంజీవి నవ్వింది.

'ఊ, అస్తమానూ వాటి గొడవేనా ? కేక వేసింది.

శ్యామలరావు వంటింట్లోకి నడిచాడు.

'పాపం, ఆయనకు ఎందుకు శ్రమ... నేను చేస్తాగా వంట.' లేచింది కమల

'నేనూ చేస్తాగా ' కమల వెంబడించింది శకుంతలను

'మీ రిద్దరేనా చేసేది...నేనేం తక్కువ ?' సంజీవి వారితో నడిచింది

నల్గురూ వంటింట్లో పాకశాసన యోధుల్లా నిలబడ్డారు. వంటింట్లోని తూములోంచి నీళ్ళు పైకి చిమ్ముతున్నాయి. వంటింట్లో చిన్న గొట్టం పొడుగ్గా వుంది...

'ఏం వండుదాం?' ప్రశ్నించింది కమల.

'బుట్టచూడండి-కూర లేమున్నాయో! సంజీవి బుట్ట మేకునుంచి దింపింది.

'ఇందులో దొండకాయలు. బంగాళా దుంపలు ఉన్నాయి...' కమల పరిశీలించింది

'ఇంతే ఈ వానరాత్రి నాకు వంకాయ వేపడం అంటే యిష్టం ' శకుంతల కాళ్ళు ముడుచుకుని పెద్దా పేరక్కలా కూర్చుంది

'అంతేలే...నీకు యిష్టమైన పదార్థాలు యీ అర్ధరాత్రి ఏ దెయ్యమైనా తెచ్చియివ్వాలి.' కమల కసిరింది.

'ఇదుగో ఆమాటే అనొద్దన్నా.' అరిచింది శకుంతల.

శ్యామలరావు యీ సందడిలో మౌనంగా పొయ్యి అంటించేశాడు. చేతులు బొగ్గులమసి పూసుకున్నాయి.

'నీళ్ళు పొయ్యనా?' చెంబుతో శకుంతల శ్యామలరావుదగ్గర చేరింది.

'చెంబు ఎందుకు-బయట చూరునుంచి బ్రహ్మాండమైన వాన కురుస్తోంటే ఆ వానలో చెయ్యి కడుక్కోవాలని

వుంది...' బయటికి పోయాడు శ్యామల రావు.

కమల, సంజీవి అలుగడ్డలు తరిగారు, వేపడానికి. 'రసం' చెయ్యాలని ఏర్పాట్లు చేశారు...

'ఏమర్రా, ఇది సొంతయిల్లు అనుకుని, గుల్లచేయకండి!' శకుంతల హెచ్చరించింది...

'అమ్మాయిగారు యీ యిల్లు అప్పుడే సొంతమైనట్టు అనుకుంటున్నారే...' సంజీవి హేళన చేసింది.

'భర్త లేనప్పుడు ఇంతపెద్ద యింట్లో ఒక్కర్తె వుంటే ఏమన్నా దెయ్యాలు పట్టుకుంటే...' కమల శకుంతల నేడ్పించాలని...

'ఇదిగో కమలా...ఓ దెయ్యంకథ చెప్పవూ?'

'నిజంగా...చెప్పనా?'

'చెప్పు...'

'శకుంతలకు...'

'ఫర్వాలేదు...బయట గదిలో శ్యామలరావుతో కబుర్లు చెప్పుకు కూర్చొమను...మరీ భయమేస్తే కాబోయే ఆర్త్రత్రాణ పరాయణుగా...అయన్ను... గట్టిగా...కౌగలిం...కుని...'

కమల, సంజీవి నవ్వుకున్నారు.

శకుంతల బయటగదిలోకి పోయింది.

శ్యామలరావు చెయ్యి కడుక్కుని వచ్చాడు.

'ఏమిటి ఏదో కథ చెబుతున్నారు?'

'ఊ'

'చెప్పండి...నేనూ వింటా ...

కమల మొదలెట్టింది...మా నాన్నగారి ఊళ్ళో మా యింటి కెదురుగా ఒక పెద్ద కాంపౌండు యిల్లు. అందులో ఒక మేష్టారు కాపురం వుండేవారుట...వారి పెద్దమ్మాయి వితంతువు జీవితంలో తప్పుచేసి గర్భం తెచ్చుకుని, నలుగురూ అనే మాటలు పడలేక బాధపడి - ఆత్మహత్య చేసుకుందిట...'

శ్యామలరావు, సంజీవి ఆతుర్తతగా వింటున్నారు.

శకుంతల కోపంగా గడపదగ్గర నిల్చుని వింటోంది

'ఆ అమ్మాయి తర్వాత దెయ్యమై...ఆ యింటి యజమాని కోడలును పట్టుకుని- గర్భంతో వుండగా నలుగురు పిల్లల్ని చంపేసింది... ఓరాత్రి నెలలు నిండాక, వచ్చి పెద్దబరువుగా కోడలుమీద వాలడం - కోడలు కేకలు అరుపులు... ఓ గంట బాధ పడ్డాక... తగ్గడం... తర్వాత ప్రసవంలో చచ్చినపిల్ల పుట్టడం పరిపాటయింది... ఆ దెయ్యాన్ని ఎవరైనా కేక వేస్తే... భీభత్సం... రాళ్ళు రువ్వడం-ఇంట్లో సామాన్లు కదిపేయడం... మంచాలు జరగడం... యిదీ వరస. ఓ రోజు భార్యా భర్తా కూర్చుని గదిలో మాట్లాడుకుంటూండగా... ఓ పెద్ద ఆడదాని కేక 'కెవ్వుమని' బయటనుంచి విన్పించింది.'

'బాబోయ్! నాకు భయంగావుంది... ఆపవే కథ.' శకుంతల బ్రతిమాలింది.

వంటింటి చిమ్నీలోంచి పెద్ద ఆడదాని కెవ్వుకేక వినిపించింది అందరికీ

కమల, సంజీవి ఆశ్చర్యపోయారు.

శకుంతల భయపడిపోయింది.

మరోసారి... పెద్దకేక—స్త్రీకంఠం

కమల, సంజీవి లేచి నిల్చుకున్నారు. ఎక్కడినుంచి ఆ కేక?

కమల శ్యామలరావువైపు చూసింది

శ్యామలరావు వంటింటి తలుపు తీశాడు... బయట... గుబురు చెట్లల్లో వానచినుకుల టపటప శబ్దాలు వినవస్తు న్నాయి. ఈదురుగాలి... మళ్ళీ అదే కేక... స్త్రీ కేక...

శకుంతల, కమల, సంజీవి ఒకరి దగ్గరి కొకరు వచ్చి భయంగా కౌగలించు కున్నారు.

'ఎవరూ లేరు బయట' అన్నాడు శ్యామలరావు ముఖం దించుకుని.

వంటింటి చిమ్నీలోంచి దడదడ రాళ్ళు పడి క్రిందకు జారాయి

'ఇది నిజంగా దెయ్యమే!... కమలా!' శకుంతల కమలను గట్టిగా కౌగలించుకుని... కళ్ళు మూర్చి అదోలా వెర్రిగా చూపు పెట్టింది...

కమలను తీసుకువెళ్ళి మంచంమీద పడుకోబెట్టింది...

అన్నం కుంపటిమీదనుంచి పొంగి పొర్లింది.

ఆలుగడ్డ మాడువాసన ప్రారంభిం చింది...

కంగారుగా సంజీవి వాటిని సరి చేసింది...

బయట కుంభవృష్టి వాన...

శ్యామలరావు ఆరాళ్ల అన్నీ ఏరాడు

'అవి నిజంగా రాళ్ళేనా?' అడిగింది సంజీవి

'అవును. దెయ్యాలు వేస్తే... అవి రాళ్ళలా కనిపిస్తాయి... అంతే.' కమల పరిశీలించింది వాటిని

శ్యామలరావు దోసిలిలో ఉన్నవి నిజంగా రాళ్ళు... కంకరరాళ్ళు... వానలో తడిసిన రాళ్ళు... శ్యామలరావు బయట కాంపౌండులోకి విసిరేశాడు...

లోపలికి వచ్చి శకుంతల దగ్గర కూర్చున్నాడు

'ఆ స్త్రీకేక—ఎవరో వీధిలో కావచ్చు' అన్నాడు శ్యామలరావు

'కాదండి... ఆ కేక చెవిలో అరిచి నట్టుగా వుందే!' అంది సంజీవి.

'అయినా వీధిలో యీ వానలో ఎవరు తిరుగుతారు? ఏ స్త్రీ అలా కేక పెడుతుంది?' అనుమానంగా కసిరింది కమల.

'అయితే యీ యింట్లో, నిజంగా దెయ్యా లున్నాయా?' సంజీవి బిక్క ముఖం పెట్టింది...

'ఉండవచ్చు...' కమల నిర్ధారణ చేసింది.

'లేవండి!... యిన్నాళ్ళూ మేముండటం లేదూ ?' శ్యామలరావు కొంచెం నమ్రతగా ఉద్ఘాటించాడు

'భయస్థులు వుంటే... వున్న దెయ్యాలు బయటికి వస్తాయి...' కమల మాటకు తాళం వేసింది సంజీవి శకుంతల మంచంమీద — లేచి కూర్చుంది.

'అక్కా '

'ఏమే ?'

'యింటికి పోదామే '

'ఇంట్లోమాత్రం దెయ్యాలు లేవూ . అక్కడకూడా అలా వెర్రిచూపు చూస్తావుగా ఒక్కొక్కసారి!' కమల కోప్పడింది

'నిజంగా !' అడిగాడు శ్యామలరావు

'అవునండీ, ఒక్కొక్కసారి దాని చూపు చూసి దెయ్యం పట్టిందని యింట్లో పిల్లలుకూడా భయపడతారు !'

'దానికే దెయ్యాలు కనిపిస్తాయి . మీకు కనిపించవు !'

శ్యామలరావు ఏదో ఆలోచనలో పడ్డాడు.

సంజీవి వంట పూర్తి చేసింది.

కమల టేబుల్సుమీద భోజనసామాగ్రి సర్దింది.

'రా ; శకుంతలా, భోంచేసి యింటికి పోదాం...'

శకుంతల మెల్లిగా అడుగులు వేసుకుంటూ వచ్చింది

కిటికీలోంచి బయటికి చూసింది. యింకా వానహోరు వినిపిస్తూనేవుంది .

శకుంతల భయం తగ్గించుకుంది

అందరూ భోజనాల కూర్చున్నారు

దెయ్యాలసంగతి మరిచి భోజనాలు, రుచులు గురించి చర్చ సాగించారు...

'అబ్బనాకు వంకాయవేపుడు లేదర్రా ఈవేళ' అంది శకుంతల...

'పాపం . ఏం కోరికలే . అటువంటి కోరికలు తీర్చడానికి...ఏదీ...యింకా నీకు సమయంలేదు ' కమల వెటకారానికి అందరూ గొల్లుమన్నారు ...

శకుంతల, శ్యామలరావును చూసి సిగ్గుపడింది

హఠాత్తుగా మీదనుంచి ఒక నీటి వంకాయి శకుంతల శిరం మీదకు వచ్చి రాలింది

శకుంతల త్రుళ్ళింది

'నీటివంకాయి' సంజీవి ఆశ్చర్యంతో చూసింది.

'యీ వంకాయి ఎక్కడిదీ ' కమల దిగ్భ్రాంతి చెందింది...

'దెయ్యం . ' ఏడ్చింది శకుంతల...

'నిజంగా దెయ్యాలున్నాయి ... పోదాం...రావే...' కమల, సంజీవి భోజనం సగంలో లేచిపోయారు... చెయ్యి కడుక్కున్నారు

'ఆగండి...యీ యింట్లో దెయ్యాల్లేవు...మీరు భయపడుతున్నారు... అంతే,' అన్నాడు శ్యామలరావు అనునయిస్తూ.

"కొంచెం అలాగే ఉండు. వెధవది మూవీ కెమెరాఅన్నా కాదు."

'లేకపోతే...యివేమిటి...కేకలు — రాళ్ళు...కుందేలు వంకాయలు ... చిత్రం... పదవే పోదాం...'

'ఈ వానలో ఎక్కడికి వెడతారు... కొంచెం ఆగండి...' శ్యామలరావు కమలను బ్రతిమాలాడు...

శకుంతల స్పృహతప్పి క్రింద వాలి పోయింది.

'అమ్మోయి — అదిగో దెయ్యం...' అరిచింది. ఆమెలో వెర్రిచూపు...

కమల భయపడింది...

ఎట్లాగా యింటికి పోయేది...

గబుక్కున ఒక ఆలోచన...

'ఏమండీ, ఓటాక్సీ పిలిపించరూ...'

కమల మాటకు శ్యామలరావు ఏ మనలేకపోయేడు...

'భోజనాలు పూర్తిచేసి..' అన్నాడు.

'అక్కర్లేదు...' మూతిముడుచుకుంది కమల.

సంజీవి చెదిరిపోయి నిల్చుంది.

శ్యామలరావు ఫోను చేశాడు.

పదినిమిషాల్లో టాక్సీ వచ్చింది.

శకుంతలకు స్పృహలేదు.

ఎత్తి తీసుకువెళ్ళి కారులో కూర్చో పెట్టారామెను. శ్యామలరావు ఆమె యింటిదాకా వెళ్ళి వాళ్ళ ముగ్గురినీ దిగ బెట్టి తిరిగివచ్చాడు...వాన వెలిసింది...

వాతావరణం చల్లగా వుంది...

శ్యామలరావు యింటికి రాగానే ముఖం కోపంతో ఉద్రేకమైపోయింది. ఏవో ఆలోచనలతో నిద్రపట్టక రాత్రిగడిపాడు.

తెల్లవారింది...

వీధి వరండాలో నిల్చున్నాడు.

ప్రక్కింటి అమ్మాయి రుస రుసగ తనకేసి చూసి, లోనికి పోయింది.

శ్యామలరావు ఓ నిట్టూర్పు విడిచాడు.

సాయంత్రం శకుంతల యింటికి వెళ్ళాడు.

శకుంతల తేరుకుంది ... ఆతను రాగానే మంచమీదే లేచి కూర్చుంది...

నవ్వింది.

శ్యామలరావు నవ్వాడు.

కమల, సంజీవి పక్కన నుంచున్నారు.

'మీ రా యింట్లో ఎలా వుంటున్నారండీ!... దెయ్యాలబాధతో...'

'ఏమీలేదు...మీరు భ్రమపడ్డారంతే!'

'మరి అవి అన్నీ ఏమిటి?' కమలకు యింకా అర్థంకాలేదు. శ్యామలరావుకు ఏం చెప్పాలో అర్థంకాలేదు...కాస్సేపు కూర్చుని శ్యామలరావు వెళ్ళిపోయాడు..

రాత్రి తొమ్మిదిన్నరకు యింటి కొచ్చాడు.

ప్రక్కింటి అమ్మాయి వరండాలో నిల్చుంది...

తలవంచుకుని ముందుకు వచ్చేశాడు శ్యామలరావు మాట్లాడకుండా...

కాస్సేపున్నాక ఒకక్షణం ఆగి 'సత్యం' అని మెల్లిగా పిల్చాడు.

'నేను రాను' అని సైగ చేసింది.

పక్కింట్లో అలికిడి లేదు.

'మీవాళ్ళు—'

'సినీమాకు వెళ్ళారు!.

'ఇలా రా.'

'ఎందుకు? ... ఎన్నాళ్ళకు తమరి మధురవాక్కు?'

నవ్వాడు శ్యామలరావు.

'ఆవతలవాళ్ళు ఛస్తున్నా రనిగూడా మీ కక్కరలేదు?'

కసిరింది ప్రక్కింటి అమ్మాయి.

'క్షమించు.' నవ్వాడు శ్యామలరావు.

ఆమె ముఖంలో మార్పు....వదనం వికసించింది...

మరుక్షణంలో యిద్దరూ... ఇంట్లో గదిలో - దగ్గరగా...

'ఏమిటి నిన్నరాత్రి?'

'అవును...రెండు నెలలనుంచీ నాతో మాట్లాడలేదు ... పైగా ... ఎవరెవరో ఆ మ్మా యి లు ... యిం ట్లో నాకు అసూయకదూ...'

'అందుకని?'...

'ఏం చేయాలో తోచక...మీమాట లన్నీ మేడమీదకు వెంటిలేటరులోంచి వినిపిస్తున్నాయి....ఇంట్లో ముసలమ్మ ఒకర్తె నిద్ర పోతోంది....మిమ్మల్ని దడిపించా లని...'

'అంతంత అరుపులా? పాపం ఆ అమ్మాయి నిజంగా మతి చెడగొట్టుకుంది.' శ్యామలరావు ఆమెబుగ్గ నిమిరాడు.



''పనిలోపని ఎందుకైనా మంచిదని నా కన్సల్‌టెంటునికూడా తీసుకొచ్చా.''

ప్రక్కింటి అమ్మాయి పరవశంతో అతన్ని ఉక్కిరిబిక్కిరి చేసింది.

ఆ మోటు పల్లెటూరి పిల్ల, కుంటి అమ్మాయి, పెరుగుగడ్డ లాటి ప్రేమ వర్షిస్తుంది. నలుగురిలో, సమయాసమయాలలో, విచక్షణలేక, ఏదో విచిత్రంగా తనముందు ప్రవర్తిస్తుంది. అది సహించలేడు శ్యామలరావు. ఈరోజు సాయంత్రం తనింటికి రాగానే తలుపుచాటునుండి 'ఢాంయ్' మంటూ మీద పడింది ఆ దృశ్యం తల్లి గమనించీ గమనించనట్లు ఊరుకుంది...... అప్పటి నుంచీ కోపంతో శ్యామలరావు మాట్లాడలేదు... ఆ విరహం, కోపం, అసూయ ఆమెను ఆరాత్రి అలా తిక్కగా మార్చేయి. అసలే నాగరికత తెలియని విచిత్రమైన తిక్క పిల్ల... శ్యామలరావుకు ఆమె అంటే ప్రేమకన్న సానుభూతి ఎక్కువ... ఆ అమ్మాయి హఠాత్తుగా 'కెవ్వున' పెద్దకేక పెట్టింది. శ్యామలరావు ఆశ్చర్యపోయాడు.

'ఇలాగే అరిచేకదా నిన్న రాత్రి.' నవ్వింది ఆ పిల్ల.

శ్యామలరావు జాలిగా ఆమె వైపు చూసి నవ్వాడు.

'దడుసుకున్నారా?' పక్కుననవ్వింది ఆమె.

'కొంచెం' అన్నాడు శ్యామలరావు.

'ఆ...అలాగా' అంటూ అమాంతంగా అతన్ని గట్టిగా కౌగిలించుకుని ఉక్కిరిబిక్కిరి చేసింది...

'ఇంకెప్పుడూ అలా రాత్రి చేసినట్లు చేయకు...తప్పు.'

'మీరు మాటాడుతూ వుండాలి.'

'అలాగే...'

ప్రక్కింటి తలుపు చప్పు డయ్యింది. ఆమె ఒక నిమిషం బిత్తరపోయి ... మెల్లిగా తలుపు తెరిచి అదృశ్య మయ్యింది ... వెడుతూ మళ్ళీ ... ఏదో సంజ్ఞ చేసింది.

'ఉ...' నవ్వాడు శ్యామలరావు.

'పాపం, ఏం అమాయకత!' నిట్టూర్పు విడిచాడు.

నిన్న సాయంత్రం ఇంట్లోకి వస్తూ అంది శకుంతల— 'ఎవరో ఒకావిడ గుమ్మం మెట్లవద్ద నా కేసి భయంకరంగా చూసింది.'

'ఏమీ' అన్నాడు శ్యామలరావు అప్పుడు

ఇంట్లోకి వచ్చి దుస్తులు మార్చుకుని వాలుకుర్చీలో ఒరిగాడు...హోరుమనే వానలో ఆమె మేడమీద తడుస్తూ చేసిన విచిత్ర చేష్టలు...పాపం? ఆమె మనసు!! నిట్టూర్పు విడిచాడు శ్యామలరావు. శకుంతల దృష్టిలో మెదిలింది... ఆమె పిచ్చి చూపు... ఒక్కొక్కసారి తిక్కచూపు. మరోసారి మధుర దృక్కు ... నిజంగా ఆమెకు దెయ్యం పడుతుందా?... శకుంతల ప్రక్కింటి అమ్మాయి — ఒక్కసారి దయ్యంలా... మరోసారి దేవతలా... ఆ విచిత్ర ప్రదర్శనలు, ఆ అపూర్వ అందాలు—అంతా అదో కలలా...

ద్వారం కర్రెనుమీద తల్లి కుట్టిన తెల్లకొంగ చేపను ముక్కుతో పట్టుకుని ఒంటికాలిమీద నిలబడింది... శ్యామలరావు నవ్వుకున్నాడు.